# నీలగిరి ఎక్స్‌ప్రెస్



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 230 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శనివారం | సెప్టెంబర్ | 28 -9 -2024 | వెల : .రూ. 5.00

## జగన్‌ను తిరుమల వెళ్లకుండా అడ్డుకున్నామా

- జగన్‌కు పోలీసులు అలా నోటీసులు ఇచ్చారా
- అబద్దాల ప్రచారంతో ప్రజలను మోసం చేయలేరు
- తిరుమల పవిత్రతను ఎవ్వరైనా కాపాడాల్సిందే
- జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) అమరావతి,

వైకాపా అధినేత జగన్‌ను తిరుమలకు వెళ్ల వద్దని ఎవరూ చెప్పలేదని, ర్యాలీలు, జనసమీకరణలు చేయొద్దని మాత్రమే చెప్పామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల అంశంపై జగన్ చేసిన ఆరోపణలు ఖండించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. నోటీసులు ఇచ్చారు, నిలుపుదల చేశారని ఆరోపిస్తున్నారు.. జగన్‌కు ఏమైనా పోలీసులు నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు.

## పొంగులేటి పై ఈడీ

# మెరుపు దాడులు



- ఏకకాలంలో 16 బృందాలు రంగంలోకి
- వందల కోట్ల ఆస్తుల గుర్తింపు
- కీలక పత్రాలు స్వాధీనం
- ఈడి సోదాలతో తెలంగాణ వ్యాప్తంగా చర్చ
- ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతో సోదాలు

సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్,

తెలంగాణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం


-మిగతా 2 లో




## నేడు నగరానికి రాష్ట్రపతి

### ముర్ము రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒకరోజు పర్యటనకు శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఇక్కడ నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. దీంతో ఆమె పర్యటన సందర్భంగా పలుచోట్ల ఆంక్షలు విధించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ,


-మిగతా 2 లో


## మాది నిర్మాణం మిది విధ్వంసం



- డబుల్ ఇళ్ల నిర్మాణమే ఇందుకు సాక్ష్యం
- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకుపోతోంది.


-మిగతా 2 లో




## పేదల కన్నీళ్లతో ఆడుకుంటే

# పతనం తప్పదు

- పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలి
- హైడ్రా పేరుతో సామాన్యులకు ఇక్కట్లు
- బాధితులకు అండగా నిలిచిన ఎంపి ఈటెల

సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్,

హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ డ్రామాలు ఆడుతోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఉంటున్న వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఆర్థిక మంత్రిగా చెబుతున్నాను... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. అప్పుల ఊబిలో రాష్ట్రం కురుకుపోయిందని


-మిగతా 2 లో




## పర్యాటక ప్రాంతాలుగా

# చారిత్రక భవనాలు

- హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ
- పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ ఒప్పందం
- గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి
- మూసీ ప్రక్షాళన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్న సీఎం రేవంత్

సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్,

మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో


-మిగతా 2 లో




## ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి

- అన్ని హామీలను ఎగవేస్తున్న సీఎం
- సిద్దిపేట రైతు ధర్నాలో హరీష్ రావు

సిద్దిపేట,

ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డెడ్‌లైన్ విధించారు. దసరా


-మిగతా 2 లో


## నామతం సమానత్వం..

# డిక్లరేషన్‌లో రాసుకోండి



- ఆలయానికి వెళుతుంటే అడ్డుకోవడం దుర్మార్గం
- హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదు
- లడ్డూ వివాదాన్ని తప్పుదోవ పట్టించే యత్నంలో డిక్లరేషన్
- మాజీ సిఎంకే ఇంతటి అవమానం జరిగితే సామాన్యుల గతేం
- తిరుమల పర్యటన రద్దు చేసుకున్న జగన్..మీడియాతో సమావేశం

సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):అమరావతి,

నా మతమేమిటని అందరూ అడుగుతున్నారని..నా మతం మానవత్వ మని కావాలంటే డిక్లరేషన్‌లో రాసుకోవాలని జగన్ సవాల్ చేశారు. దేవుడి దగ్గరకు వెళ్తూంటే ఏ మతం అని అడుగుతారా అని ప్రశనించారు. తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న తర్వాత జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిక్లరేషన్ అంశంపై స్పందించారు. తాను నాలుగు


-మిగతా 2 లో




## డిప్యూటి సీఎం భట్టి ఇంట్లో చోరీ

- నగదు, బంగారంతో పరార్
- బెంగాల్లో పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్,

తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్లో దొంగలు పడ్డారు. ప్రభుత్వంలో టాప్ 2 ప్లేస్‌లో ఉన్న భట్టి ఇంట్లోనే దొంగలు పడటం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆయన ఇంట్లోంచి భారీగా నగదు,


-మిగతా 2 లో

# పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక భవనాలు

(మొదటి తరువాయి)

సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు. నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని తీసుకుని వచ్చినట్లు సీఎం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పేదల కన్నీళ్లతో ఆడుకుంటే పతనం తప్పదు

(మొదటి తరువాయి)

అన్నారు. పేదల కన్నీళ్లతో ఆడుకుంటే రేవంత్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని అన్నారు. హైడ్రా అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉంది.. ప్రభుత్వ భూమి కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ మూసీ పరిసర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ శుక్రవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... పేదలపై కనికరం లేకుండా రేవంత్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. జొన్నల బండ వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని కూడా కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం పనులు చేస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదు... కానీ ఎన్నడో భూమి కొన్న వారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని తెలిపారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామనడ భావ్యంకాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ ప్రాంతాల్లోకి ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదని తెలిపారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మినందుకు ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఖబడ్దార్ రేవంత్.. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంపై నివేదిక ఇస్తామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చట్టాలు, జడ్జీల మీద నమ్మకం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణ రేవంత్ జాగిర్ కాదని... ప్రజలు ఓట్లు వేస్తే సీఎం అయ్యారన్న విషయం గుర్తుపెట్టుకుని మసలుకోవాలని ఈటల సూచించారు. ప్రజల మీద దౌర్జన్యం చేయడం సరికాదని అన్నారు. అవసరమైతే లక్షలాది మందితో రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని వార్నింగ్ ఇచ్చారు. హైడ్రా విషయంలో హైకోర్టుకు వెళ్తామని.. తాము చూస్తూ కూర్చోమని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు

# నామతం సమానత్వం.. డిక్లరేషన్‌లో రాసుకోండి

(మొదటి తరువాయి)

గోడుల మధ్య బైబిల్ చదువుతానని ప్రకటించారు. అందులో తప్పేముందన్నారు. బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తానని చెప్పారు. అలాగే ఇస్లాంనూ గౌరవిస్తానని.. సిక్కిజంను కూడా ఆచరిస్తానని చెప్పుకొచ్చారు. తన మతం మానవత్వమేనన్నారు. గతంలో తాను పదిహేను సార్లకుపైగా తిరుమల కొండపైకి వెళ్లి వచ్చానన్నారు. మాజీ ముఖ్యమంత్రికే ఈ పరిస్థితి వస్తే దళితుల పరిస్థితి ఏమిటని జగన్ ప్రశ్నించారు. హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం కరెక్ట్' కాదన్నారు. తనను అడ్డుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి బీజేపీ నేతల్ని కూడా తీసుకు వచ్చారని ఆరోపించారు. పాదయాత్ర చేసిన తర్వాత నడుచుకుంటూ తిరుమలకు వెళ్లాలని.. ముఖ్యమంత్రిగా ఉంటూ పట్టు వస్త్రాలు సమర్పించానని జగన్ తెలిపారు. అలాంటి తనను అడ్డుకోవాలనుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడుగుతారా అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో అన్యమతస్తులు శ్రీవారి దర్శనానికి వస్తే.. తమకు దేవదేవునిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వడం చాలా కాలంగా సంప్రదాయంగా ఉంది. గతంలో సోనియా గాంధీ, అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్లు ఇచ్చారు. అయితే ఆ తర్వాత రాజకీయ నేతలు మత పరమైన అంశాల్లో ఇలాంటి డిక్లరేషన్లు ఇవ్వడానికి సిద్ధపడటం లేదు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కూడా అలాంటి డిక్లరేషన్ అడుగుతున్న కారణమంగానే తిరుమలకు వెళ్లుండా ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. డిక్లరేషన్ విషయంలో ఆయన చేసిన వాదనను బట్టి ఈ విషయం అర్థం చేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. కూటమిలోఉన్న బీజేపీని కూడా ప్రశ్నిస్తున్నానని.. మత రాజకీయాలు చేయడం ఏమిటని మండిపడ్డారు. తిరుమల లడ్డూకు తయారు చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని జగన్ మరోసారి స్పష్టం చేశారు. కల్తీ జరగకపోయినా జరిగిందని ప్రచారం చేసి చంద్రాబాబే శ్రీవారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీశారని.. మళ్లీ ఆయనే సిట్ వేశారని మండిపడ్డారు. మొత్తంగా జగన్ తిరుమల పర్యటన రద్దునకు.. డిక్లరేషనే ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

## ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి

(మొదటి తరువాయి)

లోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలి.. లేదంటే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరులో రైతులు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులు ఏ విధంగా ఉండే.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉంది అనేది అందరికీ అర్థమైందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు రైతుల పరిస్థితి ఎలా ఉండే. రైతులకు ఎరువు బస్తా కావాలంటే పొద్దున ఐదు గంటలకు చెప్పులు లైన్లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేది. రైతులను ఎరువు బస్తాల కోసం లైన్ల నిలబెట్టింది కాంగ్రెస్. కానీ కేసీఆర్ ప్రతి ఊరికి ఎరువులను లారీల్లో పంపి రైతులకు అందించారు. కేసీఆర్ రాకముందు కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇచ్చిండు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలకుండా కడుపునిండా రైతులకు కరెంటు ఇచ్చిండు. కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వచ్చేది. కేసీఆర్ 24 గంటలు కరెంట్ అందించాడు. మళ్ళీ కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఏదో మీటింగ్‌లో అంటున్నారు కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంటు ఎట్లా వచ్చింది ఇప్పుడు ఎందుకు వస్తలేదని కరెంట్ అధికారులను ఆమె అడిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమైంది? కరోనా లేదు అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ ఉండగా నాట్లు పడే వరకు రైతుల ఫోన్లలో టింగు టింగ్ అని రైతుబంధు పడేది. ఇప్పుడు నాట్లు అయి, కలుపై, పంటకు మందు కొట్టుడు కూడా అయిపోయింది.

## జగన్‌ను తిరుమల వెళ్లకుండా అడ్డుకున్నామా

(మొదటి తరువాయి)

జగన్‌ను వెళ్లొద్దని నోటీసులు ఇస్తే.. మీడియాకు చూపించాలని డిమాండ్ చేశారు. అబద్దాలు ప్రచారం చేస్తూ.. ప్రజలను ఎందుకు మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల తితిదేలో చోటుచేసుకున్న పరిణామాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో భక్తులు ఆందోళనలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతో తిరుపతిలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంది. ఏ మతానికైనా కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు ఉంటాయి. తిరుమలకు వెళ్లాలంటే ఎవరైనా ఆచారాలు, నియమాలు పాటించాల్సిందే. ఆచారాలు పాటించకపోతే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. భక్తులు పవిత్రంగా భావించే క్షేత్రాన్ని రక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇతర మతాలను గౌరవించాలి. సొంత మతాన్ని ఆచరించాలని చంద్రబాబు అన్నారు. ఇంతకుముందు జగన్ నియమాలు ఉల్లంఘించి తిరుమల వెళ్లారు. చాలా మంది డిక్లరేషన్ ఇచ్చి గౌరవంగా దర్శనం చేసుకున్నారు. ఇతర మతాలను గౌరవించడం అంటే.. ఆయా ఆలయాల సంప్రదాయాలను పాటించడమే. బైబిల్‌ను నాలుగు గోడల మధ్యే ఎందుకు చదవాలి.. చర్చికి కూడా వెళ్లి బైబిల్ చదవొచ్చు. చెప్పిన అబద్ధాన్నే పదే పదే చెబుతున్నారు. నెయ్యి కల్తీ జరగలేదని అంటున్నారు. ఏఆర్ డెయిరీ 8 ట్యాంకర్లు పంపింది.. అందులో 4 ట్యాంకర్లు వాడారు. ఈ నివేదిక ఇచ్చింది ఎన్‌డీడీబీ.. మేం కాదు. ఈ నివేదిక దాస్తే మేం తప్పు చేసినట్లే అవుతుంది. నెయ్యి కల్తీ జరగలేదని మీరు ఎలా చెబుతున్నారు. అడల్టరేషన్ పరీక్షకు గతంలో మీరు ఎందుకు పంపలేదు? టెండర్లు పిలిచేందుకు నిబంధనలు ఎందుకు మార్చారో చెప్పాలి? నాసిరకం పదార్థాలతో ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. ఈవో చెప్పలేదు.. నివేదికలు లేవు అంటూ అబద్దాలు చెబుతున్నారు.

## మాది నిర్మాణం మిది విధ్వంసం

(మొదటి తరువాయి)

ప్పటికే కొన్ని వందల నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అనేక మందికి నోటీసులు కూడా ఇచ్చారు. తాజాగా మూసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నేసింది. గోల్నాక, చాదర్‌ఘాట్, మూసారంబాగ్.. మూసి ఆక్రమణల కూల్చివేతలకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో 1,350 మందికి హైడ్రా నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఇళ్లను హైడ్రా మార్క్ చేసింది. అయితే హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. హైడ్రా టార్గెగా మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్దాలు అనడానికి మరో సాక్షం ఇదే అంటూ పేర్కొన్నారు. మేము నిర్మిస్తే – మీరు కూల్చేస్తున్నారు.. మాది నిర్మాణం మీది విధ్వంసం.. లక్షల నిర్మాణాలు మావి – లక్షల కూల్చివేతలు మీవి. మూసి నది సాక్షిగా ఇదిగిదిగో మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్దాలు అనడానికి మరో సాక్షం ఇదే. కట్టలేదన్నారు – ప్రజలను మభ్యపెట్టాం అన్నారు – మరి లక్ష ఇండ్లు రాత్రికి రాత్రికి ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాయి చిట్టి.. మీ పాలనలో మీ అధికారులే మీ టేబుల్ ముందు పెట్టిన డబుల్ లెక్కలు చూసి మతిపోతుందా.. కేసీఆర్ నిజం, అయన హామీలు నిజం ఆయన మాట నిజం అని తెలిసి మింగుడుపడటం లేదా. మీ జూటా మాటలు, మీ కుట్రలకు, మీ దిమాక్ తక్కువ పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు ఇవ్వాళా కేసీఆర్ నిర్మాణాలే దిక్కయ్యాయి. కేసీఆర్ లక్ష డబుల్ నిర్మాణాలు నిజం – కేటాయింపులు నిజం. మీ నాలుకలు తాటి మట్టాలు కాకుంటే ఇంకోసారి అబద్దాలు మాట్లాడకండి‘ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## పొంగులేటి పై ఈడీ మెరుపు దాడులు

(మొదటి తరువాయి)

ఏకకాలంలో 15 చోట్ల తనిఖీలు చేస్తోంది. గత ఎన్నికల సమయంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. హిమాయత్ సాగర్‌లో గల ఫామ్ హౌస్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూతురు, బంధువుల ఇళ్లలో రైడ్స్ కొనసాగుతున్నాయి. పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ ఇన్ ఫ్రా కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టింది. ఖమ్మంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఇంటిలో రైడ్స్ కొనసాగుతున్నాయి. ఢిల్లీ జోనల్ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. నారాయణ పేట– కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి సంబంధం లేదని తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జరుగుతున్న రైడ్స్ దానికి కొనసాగింపు అని తెలుస్తోంది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి చిన్న వయస్సులోనే బిలియనీర్‌గా మారారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ వ్యవహారాలను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. హర్ష రెడ్డి పేరుతో రూ.1300 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇది చర్చానీయాంశం అవుతుంది. ఆ క్రమంలో వరసగా ఈడీ రైడ్స్ జరగడం చర్చకు దారితీస్తోంది.

## నేడు నగరానికి రాష్ట్రపతి

(మొదటి తరువాయి)

ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాళ్లను పరిశీలించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ఎ÷–లాజా, టివోలి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు.మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం 28న నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ ఛాన్సలర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహులు విచ్చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ వీసీ క్రిష్ణదేవరావ్ మీడియాకు వెల్లడించారు.

## డిప్యూటి సీఎం భట్టి ఇంట్లో చోరీ

(మొదటి తరువాయి)

బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు సమాచారం. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14లోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ జరిగింది. ఈ దొంగతనంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల ఆచూకీ కోసం గాలించగా.. వారంతా పశ్చిమబెంగాల్‌లో ఉన్నట్లు గుర్తించారు. నిందితులను ఖరగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు బీహార్‌కు చెందిన రోషన్ కుమార్ మండల్, ఉదయ్ కుమార్ ఠాకూర్‌గా గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ. 2.2 లక్షల నగదు, 100 గ్రాముల బంగారం, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. బెంగాల్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేయడంతో.. వారిని అదుపులోకి తీసుకునేందుకు బంజారాహిల్స్ పోలీసులు బెంగాల్‌కు వెళ్లారు. ఇటీవల టాలీవుడ్ సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు ఇంట్లోనూ చోరీ జరిగింది. ఇంట్లో పని చేసే వ్యక్తే ఈ చోరీకి పాల్పడ్డాడు. ఏకంగా రూ. 10 లక్షలు ఎత్తుకెళ్లాడు. మోహన్ బాబు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఆ దొంగను పట్టుకున్నారు. తిరుపతిలో నిందితుడిని గుర్తించిన పోలీసులు.. అతను దోచుకున్న సొమ్మును రికవరీ చేశారు. ఇప్పుడు భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ జరగడం సంచలనంగా మారింది. నమ్మి తీసుకొచ్చి.. ఇంట్లో పని కల్పించి.. ఆశ్రయమిస్తే కొందరు కేటుగాళ్లు ఇలా విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్నారు. అన్నం పెట్టిన ఇంటికే కన్నం పెడుతున్నారు. దీంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖుల ఇళ్లలోనే ఇలా జరిగితే.. సామాన్యుల ఇళ్ల పరిస్థితి ఏంటోనని ఆందోళన చెందుతున్నారు. కొత్త వారిని పనిలో పెట్టుకోవాలంటేనే జంకుతున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. పని పేరుతో ఇళ్లలో చేరిపోయి.. దోపిడీలకు పాల్పడిన ఘటనలు నగరంలో చాలా వెలుగుచూశాయి.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**కడ్తాల్ సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తొలి, మలితరం తెలంగాణ ఉద్యమాల్లో ముందుండి నడిపించిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమంలో బాపూజీ సేవలు మరువ లేనివని, నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటాలలో ముందుండి నడిపించిన



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు బీఆర్ఎస్ నేతలు అన్నారు. తెలంగాణ విమోచనం కొరకు నిజాం సర్కారును వ్యతిరేకించి ఎన్నో అవమానాలు,ఇబ్బందులు పడ్డ నేత కొండ లక్ష్మణ్ బాపూజీ అని అదేవిధంగా బాపూజీ ఆశయాలను నెరవేర్చుటలో యువకులు, మేధావులు ముందుకు రావాలని పలువురు నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా , మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్,మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ,రైతు డైరెక్టర్ నరసింహ, మాజీ వార్డు సభ్యులు నరేందర్ రెడ్డి,మూడ అశోక్ నాయకులు సిద్ధిగారి చెన్నయ్య, బ్రహ్మచారి, మూడ వెంకయ్య,పాండు నేత,శేఖర్ నేత,అశోక్ రెడ్డి, భూపాల్, గూడెపు మహేష్, వెంకటేష్, మహేష్ సురేష్ ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్స్ బంద్



**గద్వాల సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేట్ స్కూల్ టీచర్లు, డ్రైవర్స్ పైన జరుగుతున్న దాడులకు నిరసనగా నేడు ప్రైవేట్ స్కూల్స్ బంద్. పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించిన ప్రైవేట్ స్కూల్ టీచర్లు.

## ఆమనగల్ మార్కెట్ కమిటీలో వెల్జాల్ గ్రామానికి స్థానం కల్పించాలి

### – ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేసిన నాయకులు



**తలకొండపల్లి సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మార్కెట్ కమిటీలో తలకొండపల్లి మండలం లోని వెల్జాల్ గ్రామానికి సముచిత స్థానం కల్పించి ప్రాధాన్యతను ఇవ్వాలని స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి కలిసి వినతి పత్రం అందజేసిన వెల్జాల్ మాజీ ఎంపిటిసి జి. శ్రీనివాస్ మూర్తి, జూలపల్లి మాజీ సర్పంచ్ వి. జైపాల్ రెడ్డి, కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుడుముల శ్రీకాంత్ రెడ్డి, వెల్జాల్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం..



**కల్వకుర్తి సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మహిళా, శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ గంగపురం పద్మావతి పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొని పద్మావతి వారి ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు, ఉద్యోగ విరమణ అనేది ఒక ఉద్యోగాని కె కానీ మీరు మిగతా జీవితాన్ని కల్వకుర్తి పట్టణంలోని మహిళా మరియు శిశువులకు మీ సలహాలు సూచనలు ఇవ్వాలని, వారిని మానసికంగా దృడంగా ఉండేలా సూచనలను ఇవ్వాలని ఎడ్మ సత్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిడిపిఓ అధికారినిలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, నాయకులు, మరియు వారి బంధు మిత్రులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మల్లు రవికి ఘన సత్కారం



**హైదరాబాద్ సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పార్లమెంట్ పరిశ్రమల శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిని నియమించిన నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం, హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో గుర్రం కేశవులు మల్లు రవిని కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు.

# అమ్రాబాద్ మండలంలో పట్టుబడిన గుప్తనిధుల ముఠా.

**అమ్రాబాద్ సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నల్లమలలోని అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి కొంతమంది తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్తులకు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి చూడగా సుమారు ఎనిమిది మంది గుడిలో తవ్వకాలు చేసినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి ఒక కారు, ద్విచక్ర వాహనంపై కొంతమంది లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని అంతర్భాగంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారని స్థానికులకు సమాచారం అందింది. దాంతో వారు గుడి వద్దకు వెళ్లేసరికి గుప్తనిధులను పరిశీలించే పరికరాలతో కొందరు కనిపించారని, తమని చూసి పారిపోయారని పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్కడే ఒక ఉద్యోగితో పాటు వ్యక్తి పట్టుపడ్డారని చెప్పారు. దీనిపై వారిని నిలదీయగా ఎదరుదాడికి దిగారని పేర్కొన్నారు విషయం తెలుసుకున్న అమ్రాబాద్ పోలీసులు ఆలయానికి చేరుకొని పట్టుబడిన ఒక ఉద్యోగి మరో వ్యక్తితో పాటు కారు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని గ్రామస్తులు తెలిపారు. కానీ తెల్లవారేసరికి వాహనాలను, పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులను పోలీసులు వదిలేశారని ఆరోపించారు. అనంతరం శుక్రవారం పలువురు గ్రామస్తులు గుప్తనిధుల కోసం వచ్చిన వారిని అరెస్టు చేయాలని అమ్రాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అమ్రాబాద్ ఎస్సై రమేష్ ను వివరణ కోరగా రవి, హరి అనే ఇద్దరు వ్యక్తులు ఆలయం వద్ద ఉన్నారని, మరికొంతమంది వారిపై గ్రామస్తులు దాడి చేస్తారనే భయంతో పారిపోయి ఉంటారని, తదుపరి విచారణ చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

# ఉద్యమాల ఊపిరి.. కొండాలక్ష్మణ్ బాపూజీ

– వనపర్తి జిల్లా బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

–త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ

–వనపర్తి జిల్లా బిఆర్ఎస్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్

**వనపర్తి సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని ఆయన ఉద్యమాల ఊపిరి అని వనపర్తి జిల్లా టిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ కొనియాడారు. అదేవిధంగా జిల్లా అధికార ప్రతినిధి నందిమల్ల అశోక్ మాట్లాడుతూ మూడు దశల ఉద్యమాలకు ఊపిరిలూదిన కొండా లక్ష్మణ్ బాపూజీ విశాలాంధ్రను తీవ్రంగా వ్యతిరేకించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిజాం నవాబు నిరంకుశ పాలనపై అలుపెరగని పోరాటం చేశారంటు కీర్తించారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా



త్యజించిన త్యాగశీలి అన్నారు. స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ. దశాబ్దాల తెలంగాణ కల సాకారమైన వేల ఆ స్వప్నాన్ని మాత్రం ఆయన చూడలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలతో పాటు ప్రజాప్రతినిధిగా నిరంతరం ప్రజాసేవ కోసం తపించారని గుర్తు చేసుకున్నారు. న్యాయవాద విద్యను అభ్యసించి, నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారనీ, 1947లో కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చిన నిజాం నవాబుపై బాంబులు విసిరిన ధైర్యశాలి అని గుర్తు చేశారు. 1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా లక్ష్మణ, తర్వాత 1967,1972లో భువనగిరి నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. 1957–60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీపడ్డారనీ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి.రమేష్ గౌడ్,మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి, జాత్య నాయక్,కౌన్సిలర్స్ నాగన్న యాదవ్, కంచె.రవి,గులాం ఖాదర్ ఖాన్, నీల స్వామి,ప్రేమ్ నాథ్ రెడ్డి,ఎం.డి.గౌస్,మహేశ్వర్ రెడ్డి, జో హెబ్ హుస్సేన్,చిట్యాల.రాము, సిరిగిరి.మన్నెం,. పాషా,అరీఫ్,యుగంధర్ రెడ్డి, సిరివాటి. శంకర్ మాజీ మార్కెట్ డైరెక్టర్ శ్రీను,మహేష్ చారి,తోట.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఎంపిక



**వనపర్తి సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో శుక్రవారం వనపర్తి జిల్లా సెకండరీ గ్రేడ్ టీచర్స్( ఎస్ జి టి ) యూనియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జిల్లా నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి రవిరాజు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా కార్యవర్గం అనేది ఎస్జిటి టీచర్లకు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మరియు జటిలమైన సమస్యలను రాష్ట్ర కార్యవర్గానికి చేరవేస్తుంది అని ఆయన అన్నారు. ఇట్టి కార్యవర్గంలో నూతనంగా ఎంపికైన వారు జిల్లా అధ్యక్షులుగా రామ్మూర్తి, కార్యదర్శిగా భాస్కర్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా నరసింహారావు కోశాధికారిగా శివకుమార్ ఉపాధ్యక్షులుగా బస్తీరాము, ప్రవీణ్ కుమార్ రెడ్డి, వెంకటయ్య కార్యదర్శులుగా సురేష్,కృష్ణప్రసాద్, చిన్నారెడ్డి లు ఎంపికయ్యారు. ఈ సంఘానికి శాశ్వత ఆహ్వానితులు, సలహాదారులుగా బాలరాజు మరియు శ్రీనివాసు లను నియమించుకున్నారు

## గద్వాల ఎమ్మెల్యే డ్రైవర్ నర్సింహులు కుమారుడు ని అభినందించిన ఎమ్మెల్యే



**గద్వాల సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు డ్రైవర్ నర్సింహులు కుమారుడు వినయ్ సాగర్ ఇటీవల నీటిపారుదల శాఖలో A.E.E ఉద్యోగం పొంది వనపర్తి జిల్లా పెబ్బేరు నందు పోస్టింగ్ వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వినయ్ కి హార్థిక శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గం లోని అక్షరాస్యత లో వెనుకబడి ప్రాంతంగా పిలవబడే గట్టు మండలంలోని గట్టు లో చదువుకొని గట్టు మండలంలోని ఉన్నత స్థాయి ఉద్యోగంలో చాలా సంతోషంగా వార్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక యువత పట్టుదలతో కష్టపడి చదివితే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదని ఇలాగే ప్రతి ఒక్క యువత వినయ్ ను ఆదర్శంగా తీసుకొని వివిధ రంగాలలో రాణించాలని కోరారు.

## ప్రతిపక్షం-ప్రజలపక్షం

నేను ప్రజలపక్షం నాది ప్రతిపక్షం
అణగారిన వర్గాల ప్రజల పక్షం
నిజాలు మాట్లాడడం నా నైజం
అక్రమార్కుల అంతం నా పంతం

ప్రభుపాలితులే నాకు పెక్కు శత్రువులు
అణగారిన వర్గం ఆత్మీయ బంధువులు
నా జాతి జనులు నేటికీ మూగజీవాలు
వారి అభ్యర్థనలే నా ప్రశ్నల స్వరాగాలు

జనుల గోసలూ జనుల జీవనం
ప్రజల ఆక్రందనలూ ఆక్రోశాలూ
నా కలానికి నా గళానికి సిరాచుక్కలు
అణగారిన జనానికి పొద్దుపొడుపులు

కార్మిక జీవుల కళ్యాణానికి
శ్రామిక జీవుల సౌఖ్యానికి
నిరంతరం సమర్పనం అనర్గళంగా
ఖగోళమై భూగోళమై నే ప్రభవింతును

నేనిప్పుడూ నేనెప్పుడూ ఎల్లప్పుడూ
ఆశకు కరగని శిలను మెరువని శిల్పాన్ని
కన్నీటి కడగండ్లకు కరిగేటి కవికుడను
నేనూ ప్రజలపక్షమే..! నాదీ ప్రతిపక్షమే..!!

డా"జోగు కృష్ణయ్య
రంగారెడ్డి జిల్లా



## ప్రశస్త్ యాప్ ద్వారా దివ్యాంగులను గుర్తించండి

**-వనపర్తి జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త యుగంధర్**



**వనపర్తి సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 'ప్రశస్త్' యాప్ పైన శిక్షణా కార్యక్రమం జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా మండలాల ఉపాధ్యాయులకు శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వనపర్తి జిల్లా విద్యా శాఖ సమ్మిళిత విద్యా సమన్వయకర్త యుగంధర్ హాజరై ప్రశస్త యాప్ గురించి వివరించారు. ప్రశస్త యాప్ ద్వారా మండలాలలో ఉన్న దివ్యాంగ విద్యార్థులందరిని గుర్తించాలని, తద్వారా వారికి అందే ప్రభుత్వ సదుపాయాలను, దివ్యాంగ పరికరాలు, ఉపకరణాలను వారికి అందే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ప్రశస్త యాప్ ద్వారా దివ్యాంగులను గుర్తించి దివ్యాంగ పిల్లలు, సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యను అభ్యసించే విధంగా చేయూతనందించాలని పేర్కొన్నారు. ప్రశస్త్ సర్వేలో భాగంగా ఈనెల 26 నుంచి అక్టోబరు 26 వరకు 19 సం లోపు గల విద్యార్థులందరికీ, 60 అంశాలపై ప్రాథమిక సర్వే నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ & పెద్దమందడి మండలాల విద్యాశాఖ అధికారులు జయశంకర్ మరియు విష్ణు రిసోర్స్ పర్సన్ లు భగవంతు, యాదయ్య మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

---

**అచ్చంపేట సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఈనెల16 పెళ్లిరోజు అచ్చంపేట పట్టణం శ్రీ వెంకటేశ్వర జ్యువలరీ షాపు నందు నలుగురు మహిళలు వచ్చి అందులో ముగ్గురు మహిళలు లోపలికి వెళ్లి ఇద్దరు మహిళలు షాపు యజమాని అయిన ఆగేపల్లి వెంకటరమణ తో మాట్లాడుతూ వారి దృష్టిని మరల్చి అందులో ఒక మహిళ షాపులోని 10 జతల వెండి కాళ్ళపట్టీలు అందాజా వాటి విలువ 1,80,000/- నగలను దొంగిలించింది. ఆలస్యంగా గమనించిన షాపు యజమాని దొంగతనం జరిగిన విషయంపై అచ్చంపేట స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో. అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాలను పరిశీలించి, కేసును సీరియస్ గా తీసుకొని దొంగలను చేదించిన పోలీసులు నిందితులు అయిన 1.మూడవత్ బుజ్జి భర్త వెంకటేష్ 2. మూడవత్ లక్ష్మి భర్త కృష్ణ 3. మూడవత్ అస్లీ భర్త రాముల అందరి స్వగ్రామం బాజీ పూర్ తాండ మండలం తిమ్మాజీపేట వారీగా గుర్తించి వారిని ఈరోజు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

# లడ్డు పై లడాయిలతో హద్దులు దాటుతున్నారు

**-మనసు పెడితే మతరహిత మానవత్వం పరిమళించే దేశంగా మార్చవచ్చు**
**-గంగవరం రామకృష్ణా రెడ్డి**



**వనపర్తి సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తిరుమల తిరుపతి అనగానే అందరికి గుర్తుకొచ్చేది స్వామి వారి ప్రసాదమైన లడ్డు భారతదేశంలోని భక్తులందరూ ఎంతో అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించే ఆ లడ్డును రాజకీయాల్లోకి లాగి రచ్చ రచ్చ చేస్తున్నారని లడ్డుపై అంత లాడాయి అవసరమాఅని, అన్ని పార్టీల నాయకులు అందరూ ప్రజల్లో ఐక్యతను దెబ్బతీసి మతాల వారిగా కులాల వారీగా తమ వర్గాన్ని, ఓటు బ్యాంక్ ను పెంచుకోవడానికి సరైన పనులపై దృష్టి పెట్టడానికి చేతకాక ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ కు పూను కొంటారు కానీ ఈ తెలివితేటలు మంచి కోసం ప్రయత్నిస్తే మన తెలుగు రాష్ట్రాలను మత రహిత మానవత్వం పరిమళించే రాష్ట్రాలుగా తీర్చిదిద్దవచ్చు అని వనపర్తి జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షులు గంగవరం రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటన లో అన్నారు. సీనియర్ నాయకుడు చంద్రబాబు నాయుడుకి ఎక్కడ ఎప్పుడు ఏమిమాట్లాడాలో బాగా తెలుసు కానీ తాను కావాలని ఉద్దేశపూర్వకంగా కొన్ని మాట్లాడుతూ ఉంటారు, తాను అనుకుంటే ఆ చిన్న సమస్యను ఒక చిటికెన వేలుతో పరిష్కరించి స్వామివారికి తన భక్తిని చాటుకుని ప్రత్యర్థులను నోరు మూయించగలడు కానీ ప్రజల్లో రెచ్చగొట్టి లేనిది ఉన్నట్లు ఉన్నది లేనట్లు మాట్లాడి ప్రత్యర్థులను పలుచన చేయాలనే ఉద్దేశం తో ఆయన ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటాడు. నిజానికి భారతదేశంలో ఉండే గొప్పవారు రాజకీయ నాయకులు దాదాపు ఎక్కువ శాతం హేతువాదులే బహుశా నాకు తెలిసి చంద్రబాబు నాయుడు గొప్ప హేతువాది, జగన్మోహన్ రెడ్డి కూడా దాదాపు చంద్రబాబు లాంటి పాలిటిక్స్ చేస్తుంటాడని భావించవచ్చు తన పేరులో రెడ్డి ట్యాగ్ తగిలించు కొని ఆ సామాజిక వర్గాన్ని మరియు దేవుని నమ్ముతానని తాను దేవునిబిడ్డనని బడుగు బలహీన వర్గాలైన దళితులను పేదలను ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. వీరిద్దరేంటి దేశంలో చాలామంది రాజకీయ నాయకులు కేవలం ఓటు బ్యాంకు కోసం మాత్రమే భక్తి శ్రద్ధ లు చూపుతుంటారు.వీరికి మతాల పట్ల విశ్వాసం ఉంటే ఎందుకు వాటి రాజకీయాల్లోకి లాగుతారు విశ్వాసమున్న ప్రజలను తమ వైపు తిప్పుకోవడానికి వీరి ప్రయత్నం చేస్తూ ఉంటారు తప్ప వీరి అంతర్గత ఆలోచనలు ప్రజల ఆలోచనలకు భిన్నంగా ఉంటాయి. ప్రస్తుత రాజకీయ నాయకులు కేవలం ప్రజలను మేప్పించడానికి మాత్రమే తాత్కాలికమైనటువంటి ప్రణాళికతో పాలన సాగిస్తుంటారు. వీరు దేశ పౌరులుగా కాకుండా తమ పార్టీకి పరిరక్షణ కమిటీ సభ్యులుగా మాత్రమే వారి ఆలోచనలు ఉంటాయి, దేశంలో అనుభవం ఉన్న అటువంటి నాయకులు ప్రజల్లో మార్పు తేవడానికి మనసుపెట్టి ప్రయత్నిస్తే భారతదేశంలో కులమతాలున్న దేశం కాకుండా మనుషుల చేత మానవత్వం పరిమళించే దేశంగా నిలపవచ్చు అని ఆయన అన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా

# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు


**స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని కృషి చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ**
**-జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఐపీఎస్**




**గద్వాల సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** స్వాతంత్ర సమరయోధుడు, తొలి, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఐపీఎస్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని, దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కొమరంభీం జిల్లా, వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారు. 1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండాలక్ష్మణ్ బాపూజీ హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించారని, శాసన సభ డిప్యూటీ స్పీకర్ గా, ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా ప్రజలకు సేవలు అందించారని అన్నారు. 1969 తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని వారి జీవిత పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు . ఈ కార్యక్రమంలో సాయుధ దళ డి.ఎస్పి నరేందర్ రావు, ఆర్ ఐ లు వెంకటేష్, హరీఫ్, ఎస్సై రజిత , కార్యాలయ సూపరిండెంట్స్ నయీం, నాగేందర్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ గారూ జర చూడండి







**-కార్యాలయాల పరిశుభ్రతను గాలికి వదిలేసిన ప్రభుత్వ యంత్రాంగం**
**-ఫ్రైడే డ్రై డే మరియు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలకు అధికారులు ఇస్తున్న ప్రాధాన్యత సుస్పష్టం**
**-శాఖల సమన్వయ లోపం విద్యార్థుల పాలిట శాపం**
**-భవిత విద్యా వనరుల కేంద్రంలో కనీస వసతులు కరువు విద్యార్థుల తీవ్ర ఇక్కట్లు**
**-ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయాల సముదాయం నిర్వహణ నిధులు హాంఫట్?**
**-పిచ్చి మొక్కలు పందుల స్వైర విహారంతో ప్రాంగణం అస్తవ్యస్తం**



**ఆమనగల్లు 27, సెప్టెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండల పరిషత్ భవన సముదాయంలో మరియు మండల విద్యా వనరుల కేంద్రము దారిలో పరిశుభ్రతకు సంబంధించి అధికారులకు సమన్వయం లేకపోవడం వలన పిచ్చి మొక్కలు మొలసి ఆ దారిలో ఉన్న భవిత వనరుల కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థుల విద్యకు శాపంగా మారింది. నిర్వహణ కై కేటాయించిన నిధులు ఎక్కడ పక్క దారి పడుతున్నాయో అర్థం కాని పరిస్థితి ఉంది.వర్షాకాలం నేపథ్యంలో బురద,పిచ్చి మొక్కలు,వాన నీరు వెళ్లే మార్గం సరిగా లేకపోవడం మరియు పందుల స్వైర విహారంతో కార్యాలయ సముదాయ పరిసరాలు ఇటు విద్యార్థులకు అటు సామాన్య ప్రజలకు ఆటంకంగా మారింది.దీనిపై పలుమార్లు సంబంధిత మండల ప్రజా అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాధికారి దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం స్వచ్ఛతనం మరియు ఫ్రైడే డ్రైడే అనే కార్యక్రమాలు కేవలం పత్రికా ప్రకటనలకు మరియు ఉన్నతాధికారులు ఉన్న వాట్సాప్ గ్రూపులో ఫోటోలు అప్లోడ్ చేయడానికి పరిమితం అవుతున్నాయి అని ఆరోపణలు వినిపిస్తున్నాయి సాక్షాత్తు మండల ప్రజా పరిపాలన అభివృద్ధి అధికారి కార్యాలయం మరియు మండల విద్యా వనరుల కేంద్రంను అనుసరించి ఉన్న భవిత విద్యా వనరుల కేంద్రంలోనే విద్యార్థులకు లైట్ సౌకర్యం కూడా లేని పరిస్థితి మరియు ప్రాంగణంలో పాములు సంచరిస్తున్నాయి అంటే మిగతా పాఠశాలల పరిస్థితి ఏమిటో అని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అధికారులను సంప్రదించాలి అని చూస్తే మున్సిపల్ కమిషనర్ గాని మండల అధికారులు కానీ కనీసం ఫోన్కు స్పందించరు అని ప్రజలు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ ఆమనగల్లు మండలం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి కార్యాలయ సముదాయాలను పరిశుభ్రం చేయించి ఆదర్శంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

# రైతులు సింగిల్ విండో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

-డీసీసీబీ డైరెక్టర్, పీఏసీ ఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా

**ఆమనగల్లు, సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతుల సంక్షేమమే ధ్యేయంగా సింగిల్ విండో సేవలందిస్తుందని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. రైతన్నలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలు అందిస్తూ వ్యవసాయరంగాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం చైర్మన్ ఛాంబర్లో లో మహాజన సభ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తోపాటు పాలకవర్గం పాల్గొని పలు అంశాలపై చర్చించారు. వరిధాన్యంకు గిట్టుబాటు ధర అందించేందుకు సింగిల్ విండో ఆధ్వర్యంలో వచ్చే అక్టోబర్ మాసంలో కొను గోలు కంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, క్వింటాలుకు



సభలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్, పీఏసీ ఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా

రూ.2320 మద్దతు ధర ఉంటుందని ఆయన వివరించారు. అలాగే సన్నరకం వడ్ల ప్రోత్సాహం క్రింద రూ.500 అదనంగా అందివనున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ భూమి కల్గిన యజమానులకు ఐటీ రిటర్న్ లేకుండా విదేశీ రూ. 40 లక్షల వరకు విద్య, రూ. 10లక్షల గృహ రుణాలను డీసీసీబీ ద్వారా అందిస్తున్నట్లు గంప వెంకటేష్ గుప్తా వివరించారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలో 388 మంది రైతులు రుణమాఫీ పథకంకు ఎంపి కయ్యారని, అందులో 215 మంది రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ లబ్ది పొందారని అన్నారు. మిగతా 173 మంది రైతులకు త్వరలోనే రుణ మాఫీ అవుతుంది అని వారు అన్నారు. సింగిల్ విండో ద్వారా అందుతున్న సేవలను రైతన్నలు సద్విని యోగం చేసుకోవాలని గంప వెంకటేష్ గుప్తా కోరరు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, సభ్యులు జోగు వీరయ్య, చేగురి వెంకటేష్, వెంకయ్య, సేవ్య, దోల్య, గడిగే చెన్నమ్మ, ఎనమల జంగమ్మ, డీసీసీబీ మేనేజర్ గోపాల్, సీఈఓ గోరటి దేవేందర్, సిబ్బంది అల్లాజీ, పద్మాకర్ రెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

# చెన్నైలో ద్రవిడ కజకం కార్యాలయం సందర్శన

-ఎంపీ వద్ది రాజ్ రవిచంద్ర మాజీ మంత్రి గంగుల,శ్రీనివాస్ యాదవ్

**సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బ్యూరో ఖమ్మం :**
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, మండలిలో ప్రతిపక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్,వీ.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే పుట్టా మధుకర్ తదితరులతో కలిసి చెన్నైలోని ద్రవిడ కజకం (డీకే) కార్యాలయాన్ని సందర్శించారు.బీఆర్ఎస్ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మార్గనిర్దేశనం,వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు సూచన మేరకు పార్టీకి చెందిన బీసీ నాయకులతో కూడిన 40మంది ప్రతినిధుల బృందం తమిళనాడులో వెనుకబడిన కులాల సామాజిక, ఆర్థిక,రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు గాను గురువారం చెన్నై వెళ్లిన విషయం తెలిసిందే.ఈ బృందం గురువారం తమిళనాడు ప్రభుత్వ బీసీ,ఎంబీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి విజయ్ రాజా కుమార్,కమిషనర్ వెంకటేష్ తదితర ఉన్నతాధికారులతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించింది.అలాగే ఈ బృందం శుక్రవారం ఉదయం తమిళనాడు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమోహన్,బీసీ సంఘాలకు చెందిన పలువురు నాయకులతో సమావేశమై చర్చలు జరిపింది.కాగా, ఎంపీ రవిచంద్ర,ఎమ్మెల్సీలు బండా ప్రకాష్,




మధుసూదనాచారి,మాజీ మంత్రులు కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మధుకర్ తదితర ప్రముఖులు శుక్రవారం సాయంత్రం ద్రవిడ కజకం కార్యాలయాన్ని సందర్శించి ద్రావిడ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన వీరమణితో సమావేశమయ్యారు. ద్రావిడ ఉద్యమం పుట్టుక,దాని పూర్వాపరాలు, తదనంతర పరిణామాలు, వెనుకబడిన కులాల సమున్నతికి దోహదపడిన అంశాల గురించి బీఆర్ఎస్ నాయకులు డీకే అధ్యక్షులు వీరమణిని అడిగి తెలుసుకున్నారు.ద్రావిడ ఉద్యమానికి మూల పురుషుడు స్వర్గీయ పెరియార్ రామస్వామి నాయకర్ ఫోటోలు ఉపయోగించిన వస్తువుల ప్రదర్శనను బీఆర్ఎస్ నాయకులు ఆసక్తి తిలకించారు, ఉద్యమచరిత్రను డీకే అధ్యక్షులు వీరమణి బీసీ ప్రముఖులకు వివరించారు.ఈ సందర్భంగా పెరియార్ రామస్వామి నాయకర్ విగ్రహం వద్ద బీసీ ప్రముఖులు ఫోటోలు దిగారు.చెన్నై పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గురువారం వీరనారి చిట్యాల ఐలమ్మ, శు



క్రవారం త్యాగధనులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు.

# సీతారామ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం

-పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- టన్నెల్ పనులు శరవేగంగా చేపట్టాలి
-భూసేకరణలో అలసత్వం వహించదు
-మంత్రులు తుమ్మల, మంత్రి ఉత్తమ్

**సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బ్యూరో ఖమ్మం:**
సీతారామ ప్రాజెక్ట్ టన్నెల్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలు మేరకు జల సౌదలో సీతారామ ప్రాజెక్టు పనులపై,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్,రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లతో కలిసి మంత్రి తుమ్మల నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ యాతాలకుంట టన్నెల్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఆగస్ట్ 15 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్ పంప్ హౌజ్ లను ప్రారంభించామని



మిగిలిన కాలువలను,టన్నేల్ పనులను యుద్ధ పాతిపదికను పూర్తి చేయాలని సూచించారు.ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితను పూర్తి చేయాలని ఎక్కడ కూడా అలసత్వం వహించొద్దని సూచించారు.అందుకు పాలనా పరమైన అనుమతులలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.టెండర్ల ప్రక్రియను శరవేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరమైన అంశాలలో నిర్లక్ష్యం వహించకుండా పరస్పరం సమన్వయంతో అన్ని శాఖలు పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిర్ణిత గడువు లోపు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రైతాంగానికి ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన సీతారామ ప్రాజెక్టు తన చిరకాల స్వప్నం అన్నారు. ప్రాజెక్టుతో జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాధ్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇ.ఎన్.సి లు అనిల్ కుమార్, నాగేందర్ రావు లతో పాటు సీతారామ ప్రాజెక్ట్ సి.ఇ శ్రీనివాస రెడ్డి,ఖమ్మం జిల్లా సి.ఇ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణం.. ప్రాణసంకటం

-బస్సు పుట్‌బోర్డుపై విద్యార్థులు





**యాచారం సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి డిపో నుంచి కరోనా అనంతరం రద్దయిన అమనగల్ , మేడిపల్లి - మాల్, మేడిపల్లి హైదరాబాద్ మార్గాల్లో సేటల్ సర్వీసులు పున : ప్రారంభించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అమనగల్ , కడ్తల్ , యాచారం మండలంలోని గ్రామీణం నుంచి పట్టణ ప్రాంతాలకు విద్యనభ్యసించేందుకు పోయి వచ్చే విద్యార్థులు అరకొర బస్సులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బ స్సు సౌకర్యం కల్పించడంతోపాటు బస్సుల సంఖ్యను తగ్గించడంతో విద్యార్థులు (హైదరాబాద్) పట్టణ ప్రాంతాలకు రావడానికి పోవడానికి పడరాని పాట్లు ప డుతున్నారు.ఈ క్రమంలో శుక్రవారం పలేచెల్క తండా నుంచి ఇబ్రహీంపట్నం, జెబియస్ వెళ్లే బస్సులో తిరుగు ప్రయాణంలో విద్యార్థులు ఇలా ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా వెళ్తుండగా.. ' నీలగిరి ఎక్స్' ప్రతినిధి తన కెమెరాలో బంధించారు.

## కుత్బుల్లాపూర్ లో త్రాగునీటి, రోడ్ల పనులు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చేర్చి గాగ్గిల్లాపూర్ రాజీవగాంధీ నగర్లో త్రాగునీటి, రోడ్ల, ప్రభుత్వ కళాశాలలో షౌచాలయాల మరమ్మత్తు పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు.గత కొన్ని సంవత్సరాలుగా త్రాగునీరు, సక్రమంగా రోడ్లు, ప్రభుత్వ కళాశాలలో షౌచాలయాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలు, దుండిగల్ మైనారిటి సెల్ అధ్యక్షులు నయీమ్ పాషా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ హన్మంత్ రెడ్డి గారితో తమ సమస్యలను వివరించారు. ఈ నేపథ్యంలో, ఇంచార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు ప్రత్యేక నిధుల ద్వారా 15 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బి-బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు యం. నవీన్ రెడ్డి, చేర్చి గాగ్గిల్లాపూర్ సీనియర్ నాయకులు వై. శ్రీకర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, పద్మారావు, విజయ్, సంజీవరెడ్డి, మైనారిటీ నాయకులు సమీర్ ఖాన్, ప్రభాకర్, రాజీవగాంధీ నగర్ సీనియర్ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహేమాన్ (బాబు), అబ్దుల్ రాఫ్, మహమ్మద్ పాషా (లాలు), సయ్యద్ యూసఫ్ యుదీన్, దుండిగల్ మహిళా జనరల్ సెక్రటరీ ఇర్ఫానా సుల్తానా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రేబిస్ వ్యాధి టీకాలు కుక్కలకు తప్పకుండా వేయించుకోవాలి



**సెప్టెంబర్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): /సంగెం**
ప్రపంచ రేబిస్ డే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28 న జరుగుతుంది. ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకొని రేబిష్ వ్యాధి నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన పెంపొందించడానికి, ర్యాలీలు, పరుగు పందాలు, కుక్కలకు వేసే టీకాల గురించి అవగా అవగాహన కల్పించడం మొదలగు కార్యక్రమాలు చేపడతారు. ఈ వ్యాధి జంతువుల నుండి మానవులకు సోకే అవకాశం ఉన్నందున రేబిస్ వ్యాధి గురించి అవగాహన పెంపొందించడం, రేబిష్ వ్యాధి నివారణ చర్యలు చేపట్టడం ఈ ప్రపంచ రేబిస్ వ్యాధి ముఖ్య ఉద్దేశం. సంగెం మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో ఈ వ్యాధికి సంబంధించిన టీకాలను వేస్తున్నారు. కావున మండలంలోని ప్రతి గ్రామంలో ఇండ్లలో కుక్కలు పెంచుకునేవారు శనివారం రోజు ఉదయం 10: గంటల నుండి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకొని కుక్కలను కాపాడుకోవాలని మండల్ పశు వైద్య అధికారి వల్లే రాజు కోరారు.




## అక్టోబర్ 4న థియేటర్లలోకి.. పుకార్లపై పోరాటం 'మిస్టర్ సెలెబ్రిటీ'

ప్రస్తుతం కొత్త కాన్సెప్టులనే ఆడియెన్స్ ఎక్కువ ఆదరిస్తున్నారు. నవతరం తీస్తున్న చిత్రాలకు తెలుగు ఆడియెన్స్ ఫిదా అవుతున్నారు. ఈ క్రమంలోనే పరుచూరి వెంకటేశ్వరరావు మనుమడు సుదర్శన్ పరుచూరి 'మిస్టర్ సెలెబ్రిటీ' అనే చిత్రంతో హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఆర్‌పి సినిమాస్ బ్యానర్‌పై చిన్న రెడ్డయ్య, ఎన్. పాండు రంగారావు నిర్మాతలుగా రాబోతోన్న ఈ మూవీకి చందిన రవి కిషోర్ దర్శకత్వం వహించారు. వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రీ దీక్ష, నాజర్, రఘుబాబు ముఖ్య పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్, టీజర్, పాటలు ప్రజల్లో మంచి ఆదర్ణను దక్కించుకోగా సినిమాపై అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. ముఖ్యంగా 'రామాయణం కాలంలో చాకలి వాడు అన్న పుకారు మాటలకు సీతాదేవీ అరణ్య వాసం, అగ్ని ప్రవేశం చేయాల్సి వచ్చింది.. కాలం మారింది కానీ ఈ పుకారు మాటల వల్ల పోయే ప్రాణాలు ఇంకా పోతూనే ఉన్నాయి' అంటూ సాగే డైలాగ్స్‌కట్టుకునేలా ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ రిలీజ్ చేశారు. అక్టోబర్ 4న ఈ చిత్రం రానుందని ప్రకటించారు. ఈ సందర్భంగా పరుచూరి బ్రదర్స్ మాట్లాడుతూ.. 'మా మనవడు పరుచూరి సుదర్శన్ నటించిన మిస్టర్ సెలెబ్రిటీ అక్టోబర్ 4న రాబోతోంది. మమ్మల్ని ఆదరించినట్టుగానే మా మనవడ్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నాను. కొత్త దర్శకుడైనా కూడా సినిమాను బాగా తీశారు. ఈ చిత్రాన్ని నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా గొప్పగా నిర్మించారు.
చిత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది.
అక్టోబర్ 4న తప్పకుండా మిస్టర్ సెలెబ్రిటీ సినిమాను చూడండి' అని కోరారు

## రీతూ పాప కూడా మొదలెట్టేసిందిగా..!



తెలుగమ్మాయి రీతూ వర్మ గుర్తుందా. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారిన సినిమాలు చేస్తోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడురీర్ బిగినింగ్ లో పలు షార్ట్ ఫిలిమ్స్ లో నటించింది ఈ భామ. ఆతర్వాత సినిమాల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా నటించిన బాద్షా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా హీరోయిన్ చెల్లి పాత్రలో మెరిసింది. ఆ తర్వాత కొంత గ్యాప్ ఇచ్చింది2013లో ప్రేమ ఇష్క్ కాదల్ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది. నా రాకుమారుడు, ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాల్లో హీరోయిన్ గా చేసి ఆకట్టుకుంది. ఇక 2016లో వచ్చిన పెళ్ళిచూపులు సినిమా ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది.నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, ఒకే ఒక జీవితం, కణం, ఆకాశం, మార్క్ ఆంటోని సినిమాలు చేసింది. ఈ భామ నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాల ఎంచుకుంటూ రాణిస్తుంది. ఇక ఇప్పుడు ఈ బ్యూటీ శ్రీవిష్ణు హీరోగా చేస్తున్న సినిమాలో నటిస్తుంది. శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న స్వాగ్ సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా రీతూ వర్మ గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మొత్తివరకు పద్దతిగా కనిపించిన ఈ చిన్నది .. ఇప్పుడు గ్లామర్ గేట్లు ఎత్తేసింది.

## సందడి లేకుండా పని పూర్తి చేసిన పూజా హెగ్డే

చేసే పనులన్నీ సైలెంట్‌గా చేస్తున్నపుడు ఇంక ప్రమోషన్స్ ఎందుకు చెప్పండి..? పూజా హెగ్డే చేస్తున్నదిదే. కొన్నేళు గా ఈమె కెరీర్ మునపట్లా అయితే లేదు.. అందులో ఎలాంటి అనుమానాలక్కర్లేదు కూడా. అలాగని ఖాళీగా ఉన్నారా అంటే అదీ లేదు. చడీ చప్పుడూ లేకుండా ఓ పాన్ ఇండియన్ సినిమా పూర్తి చేసారు. ఆ సినిమా ఏంటి..? అసలు పూజా కెరీర్ ఎలా ఉందిప్పుడు..?మూడేళ్ళ కింది వరకు పూజా హెగ్డే కెరీర్ ఫుల్ స్పీడ్ మీదుండేది. కానీ 2022 తర్వాత ఈమె కెరీర్ తిరగబడిపోయింది. ఆ ఏడాది రాధే శ్యామ్, ఆచార్య, బీస్ట్, సర్కస్ అంటూ వరస ఫ్లాపులిచ్చారు పూజా. 2023లో కిసీకా భాయ్ కిసీకా జాన్‌లో మాత్రమే నటించారు2024లోనూ పూజా చేతిలో ఒకట్రెండు సినిమాలు మాత్రమే ఉన్నాయి. పూజా హెగ్డే ప్రస్తుతం సూర్య 44లో నటిస్తున్నారు. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్ర షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఆసక్తికరమైన విషయమేంటంటే.. ఇందులో పూజా హెగ్డే పోర్షన్ పూర్తైంది.సూర్య 44 షూట్ మొదలైన విషయమే చాలా మందికి తెలియదు.. అలాంటిదిప్పుడు ఏకంగా పూజా పోర్షన్ పూర్తైందని చెప్పడం షాకే. ఈ విషయాన్ని స్వయంగా ఈమె చెప్పింది. చడీ చప్పుడు లేకుండా ఇంత పెద్ద సినిమాలో తన పోర్షన్ పూర్తి చేసారు పూజా హెగ్డే.హిందీలో షాహిద్ కపూర్‌తో దేవాలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈమె కెరీర్ ఈ రెండు సినిమాలపైనే ఆధారపడి ఉంది. ఇవి హిట్టైతేనే పూజాకి మరిన్ని ఆఫర్స్ వస్తాయి. తెలుగులో నాగ చైతన్య, కార్తిక్ దండు సినిమాలో పూజా హీరోయిన్‌గా నటించే అవకాశాలున్నాయి.



## రకుల్ ప్రీత్ సింగ్ సినిమా షూటింగ్ రద్దు.. కారణమిదే..!



కెరటం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది ఢిల్లీ భామ రకుల్ ప్రీత్ సింగ్. హీరోయిన్‌గా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో టాలీవుడ్‌లో మంచి బ్రేక్ అందుకుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగిన ఈ భామ తెలుగు సినిమాలో కనిపించక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం హిందీ ప్రాజెక్టులపైనే ఫోకస్ పెట్టింది. ఈ భామ అజయ్ దేవ్‌గన్, టబు ప్రధాన పాత్రలు పోషిస్తున్న దే దే ప్యార్ దే 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్ర షూటింగ్ కొన్ని రోజులుగా పాటియాలో జరుగుతుంది. అయితే అనుకోకుండా సినిమా షూటింగ్ రద్దయినట్టు ఓ వార్త బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం మూడీ డైరెక్టర్ అన్షుల్ శర్మ అస్వస్థతకు లోనవడంతో రెండు రోజులపాటు చిత్రీకరణ నిలిపేసినట్టు తెలుస్తోంది. అన్షుల్ వర్మ డెంగ్యూ అని నిర్ధారణ కాగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. అన్షుల్ శర్మ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సినిమా మరో నెలపాటు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. దే దే ప్యార్ దే 2 షూటింగ్ మళ్లీ నవంబర్‌లో మొదలు కానున్నట్టు ఇన్‌సైడ్ టాక్. రకుల్ ప్రీత్ సింగ్ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఇండియన్ 3 పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

## దేవర విడుదలతో ఎన్టీఆర్ జోష్

### అభిమానులకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్, సైఫ్‌అలీఖాన్ కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈనేపథ్యంలోనే 'దేవర' రిలీజ్‌ను పురస్కరించుకొని సినీ ప్రియులు, అభిమానులను ఉద్దేశించి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. తాను ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న రోజు వచ్చిందని పేర్కొన్నారు. అభిమానులు చూపించే ప్రేమకు ఎప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. మా సినిమాపై మీరు చూపిస్తోన్న అభిమానాన్ని చూసి చాలా సంతోషంగా ఉంది. అద్భుతమైన డ్రామా, భావోద్వేగాలతో 'దేవర' తీర్చిదిద్దినందుకు థ్యాంక్యూ కొరటాల శివ. మై బ్రదర్ అనిరుధ్.. నీ మ్యూజిక్‌తో మా ప్రపంచానికి ప్రాణం పోశావు. ఈ చిత్రానికి బలమైన సపోర్ట్‌గా నిలిచిన మా నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, అద్భుతంగా వర్క్ చేసిన సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సాబు సిరిల్‌తోపాటు టెక్నీషియన్స్ అందరికీ కృతజ్ఞతలు. నా అభిమానుల వేడుకలు చూసి నా మనసు నిండింది. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటా. నాలానే మీరూ ఈ చిత్రాన్ని ఎంజాయ్ చేయడం చూస్తుంటే సంతోషంగా ఉంది. మీకు మరెంతో వినోదాన్ని అందిస్తానని మాటిస్తున్నా అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

